క్లుప్తంగా

హైందవ శంఖారావం కరపత్రాల ఆవిష్కరణ



భట్టిప్రోలు: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలోని గన్నవరం విమానాశ్రయం సమీపంలో జరగనున్న హైందవ శంఖారావం భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు కోరారు. బుధవారం భట్టిప్రోలులో శంఖారావం కరపత్రాలను ఆవిష్కరించి జనజాగరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమ శంకరరావు మాట్లాడుతూ హిందువుల ఐక్యతను తెలియజేస్తూ దేవాలయాల రక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా హిందువులు లక్షలాదిగా తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో రావూరి సత్యన్నారాయణమూర్తి, బండారు శ్రీనివాసరావు, వంగర చలమయ్య సిద్ధాంతి, త్రాప రవికుమార్, సీహెచ్‌వీ ఉమామహేశ్వరరావు, వంగర నాగేశ్వరరావు, పురం రాముడు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

బలుసులపాలెం వీఆర్వో మృతి



చెరుకుపల్లి: బలుసులపాలెం వీఆర్వో షేక్ అజీజ్ (51) బుధవారం తెల్లవారుజామున గుండె పోటుతో తన స్వగ్రామం చిన్నమట్లపూడిలో మృతి చెందారు. అజీజ్ చెరుకుపల్లి మండలంలోని కనగాల ఇన్‌చార్జ్‌గా ఆరేపల్లి పంచాయతీలో పని చేసి ప్రస్తుతం బలుసులపాలెం వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు. వీఆర్వో అజీజ్ భౌతికకాయాన్ని చెరుకుపల్లి ఆర్ఐ మౌనిక, వీఆర్వోలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు. అజీజ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

వేటపాలెంలో 'పొలం పిలుస్తోంది'



చుండూరు(వేమూరు): రబీ సీజన్‌లో మొక్కజొన్న, జొన్న సాగు చేసే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను బాపట్ల జిల్లా వనరుల కేంద్రం డీడీఏ విజయ నిర్మల తెలిపారు. చుండూరు మండలంలోని వేటపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రబీ సీజన్‌లో సాగు చేసే మొక్కజొన్నలో తీసుకోవాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను రైతులకు ఆమె వివరించారు. కత్తెర పురుగు నివారణకు ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలని తెలిపారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జన్నమ్మ నిమ్మ తోటల్లో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీ, మండల వ్యవసాయాధికారి ఆదం బాబు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ సమీపంలో వ్యక్తి మృతి

బాపట్ల: మార్కెట్ సెంటర్‌లో షేక్.నాయబ్ రసూల్(44) అనే వ్యక్తి బుధవారం మృతి చెందాడు. మద్యం ఎక్కువ తాగటం వలనే చనిపోయి ఉంటాడని స్థానికులు చెబుతున్నారు. సీఐ అహ్మద్ జానీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

కొల్లిపర: గంజాయి విక్రయించటం, త్రాగటం చేస్తున్న 8 మంది యువకులను అరెస్టు చేశామని తెనాలి రూరల్ సీఐ బెల్లంకొండ శ్రీనివాసరావు తెలిపారు.గంజాయి విక్రేతల అరెస్టుపై బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లిపర మండల పరిధిలో యువత పిడపర్రు లాకులు సమీపంలో కృష్ణా నదిలో పుష్కర ఘాట్ వద్ద 8 మంది యువకులు గంజాయి త్రాగటం మరియు అమ్మకం చేస్తున్నారు అని సమాచారం రావటంతో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఐ పి.కోటేశ్వరరావు, సిబ్బంది, వీఆర్వో తో కలసి సంఘటనా స్థలానికి చేరుకున్ని అక్కడ ఉన్న తూములూరు గ్రామానికి చెందిన 5మందిని, విజయవాడకు చెందిన ఇద్దరు, ఒరిశా కి చెందిన ఒకరు కలసి మొత్తం 8 మంది యువతను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 2.7 కేజీల గంజాయి, రూ.3000 నగదు, ఒక మైటార్ బైక్ స్వాధీన పరుచుకుని వారిపై కేసు నమోదు చేయటం జరిగిందన్నారు. 8 మందిలో ప్రధాన నిందితులుగా విజయవాడకు చెందిన గౌతం, ఒరిస్సా కు చెందిన అప్పారావు పేర్లు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి రవాణాదారులు, విక్రేతలపై, సేవించే వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. చట్టం ప్రకారం గంజాయి సేవించిన, అమ్మినా నేరమని ఇటు వంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ విషయం గుర్తించుకోవాలని, గ్రామాలల్లో ఎక్కడైనా గంజాయి అమ్మకాలు జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అధికారుల వెంట ఏఎస్ఐ పోతురాజు, కానిస్టేబుల్‌లు తాతరావు, నాగబాబు, కూర్మారావు, విఆర్వో రామారావు ఉన్నారు.



వివిధ దశలలో నిలిచిన నిర్మాణాలు

మంజూరు కాని బిల్లులు.. నిలిచిన పనులు

అటు రైతులకు ఇటు ప్రజలకు ఉపయుక్తంగా ఉండేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రేపల్లెలో రైతు బజార్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రేపల్లె డివిజన్ పరిధిలో ఎక్కడా రైతు బజారు లేదు. దీంతో గత ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసి నిర్మాణం చేపట్టింది. ప్రజలు, రైతులు రేపల్లెకు రైతు బజార్ వస్తుందని సంతోషించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిల్లులు మంజూరు చేయకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

- కూటమి ప్రభుత్వంలో అభివృద్ధికి ఆటంకం
- అర్ధంతరంగా నిలిచిపోయిన రైతు బజార్ నిర్మాణం
- గత ప్రభుత్వానికి పేరు వస్తుందని కూటమి నేతల నిర్వాకం

రేపల్లె రూరల్: రేపల్లె పట్టణంలో నిర్మాణంలో ఉన్న రైతు బజార్ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. గత ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ప్రస్తుత కూటమి నేతలు అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారు. రేపల్లె తీర ప్రాంత రైతులు పండించిన పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు దళారులతో ప్రమేయం లేకుండా నేరుగా విక్రయించుకునేందుకు వీలుగా, వినియోగదారులకు సరసమైన ధరలకు కూరగాయలు అందించాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు బజార్ నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించింది. దీంతో నిర్మాణ పనులు 75 శాతం వరకు పూర్తి అయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు నిర్మాణ పనులను ఆపి వేశారు.



నిర్మాణం మధ్యలో ఆగిపోయిన రైతు బజారు

రైతులకు ఎంతో మేలు

రైతు బజార్ నిర్మాణం పూర్తయితే తీర ప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతు బజారులో రైతులు తమ పంటలను విక్రయించుకునేందుకు అవకాశం కలుగుతుంది. దీంతో పాటు వినియోగదారులకు సరసమైన ధరలకు పండ్లు, కూరగాయలు అందుబాటులో ఉంటాయి. రేపల్లె ప్రాంతంలో అరటి, సపోటా, బొప్పాయి, జామ వంటి పండ్ల సాగు, టమాటా, దొండ, బెండ, వంగ, పచ్చిమిరపతో పాటు పలు రకాల ఆకుకూరలను కూడా రైతులు సాగు చేస్తుంటారు. ఇప్పటివరకు ఈ ప్రాంతంలో రైతు బజారు లేకపోవడంతో రైతులు పండించిన పంటలను సంతలు, రహదారుల వెంబడి విక్రయాలు జరుపుతూ ఇబ్బందులు పడేవారు.

75 శాతం పూర్తయిన పనులు

సమస్యను అధిగమించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు బజార్ నిర్మాణానికి రూ.2 కోట్లను కేటాయించింది. దీంతో 15 షట్టర్ గదులు, 22 ఓపెన్ గదులతో భవన నిర్మాణ పనులను చేపట్టారు. 75 శాతం పైగా భవన నిర్మాణం పూర్తయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిల్లులు ముంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్‌లు పనులను నిలుపుదల చేశారు. దీంతో కూటమి ప్రభుత్వంలో రైతు బజార్ నిర్మాణానికి గ్రహణం పట్టింది. ఇంకా భవనానికి ప్లాస్టరింగ్, రంగులు, కరెంటు పనులు చేయడంతో పాటు పైపులైన్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు తెలియజేశాం

బిల్లుల మంజూరులో జాప్యం జరగటంతో కాంట్రాక్టర్‌లు రైతు బజారు నిర్మాణాన్ని తాత్కాలికంగా ఆపారు. ఇప్పటి వరకు 75 శాతంపైగా పనులు పూర్తయ్యాయి. బిల్లులు పెండింగ్ ఉన్న అంశాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. బిల్లులు మంజూరవ్వగానే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపడతాం.

– వేణుగోపాల్ కృష్ణ, మార్కెట్‌యార్డు సెక్రటరీ, రేపల్లె

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి



పట్టణంలో నిర్మాణంలో ఉన్న రైతు బజారు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలి. రైతు బజారు వినియోగంలోకి వస్తే తీర ప్రాంతంలో రైతులు పండించిన పంటలను నేరుగా వారే దళారుల ప్రమేయం లేకుండా విక్రయించుకునే అవకాశం ఉంటుంది. వినియోగదారులకు సరసమైన ధరలకు తాజా పండ్లు, కూరగాయలు లభిస్తాయి.

– సి.వి.మోహనరావు, పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి, రేపల్లె

ప్రజా సంక్షేమం కోసం పని చేయాలి



పాలక ప్రభుత్వం రాజకీయాలను పక్కనపెట్టి ప్రజా సంక్షేమం కోసం పని చేయాలి. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన రైతు బజారు వల్ల తీరప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. రేపల్లె డివిజన్‌లోని రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు రైతు బజారు లేకపోవటం శోచనీయం. దాని ఆవశ్యకతను గుర్తించి గత ప్రభుత్వం రేపల్లె పట్టణంలో ఏర్పాటు చేయటం అభినందనీయం. రాజకీయాలు చేయకుండా రైతు బజారు నిర్మాణాన్ని ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేయాలి.

– సీహెచ్ మణిలాల్, సీపీఎం పట్టణ కార్యదర్శి, రేపల్లె

రేపటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు

వేమూరు: ఈ నెల 6వ తేదీ నుంచి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దారు సుశీల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామ సభలు ఈ నెల 6వ తేదీ నుంచి 2025 జనవరి 7వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని ఆమె చెప్పారు. 6వ తేదీన కుచ్చెళ్లపాడు, వెల్లబాడు గ్రామాల్లో, 10న పెనుమర్రు, కోడిపర్రు, 12న పెరవలి, 13న పెరవలి పాలెం, 17న వరహాపురం, 18న వేమూరు, 19వ తేదీన చంపాడు, 21న జంపని, 24న బూతుమల్లి, 26న చదలవాడ, కాకర్లమూడి, 28న చావలి, 31న అబ్బనగూడవల్లి, జనవరి 3వ తేదీన బలిజేపల్లి, 7న పోతుమర్రు, గ్రామ సచివాలయాల్లో గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని ఆమె అన్నారు.

నీటి సంఘాల ఎన్నికల ఏకగ్రీవానికి కృషి చేయాలి

కొల్లూరు: భవిష్యత్తులో చేపట్టనున్న నీటి సంఘాలు, సొసైటీల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యేలా నాయకులు, కార్యకర్తలు చర్చించుకొని ఏకతాటిపైకి రావాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు అన్నారు. బుధవారం కొల్లూరు ఎంప్లాయిస్ రిక్రియేషన్ హోమ్‌లో నిర్వహించిన టీడీపీ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో పార్టీ విజయానికి దోహదం చేసిన నాయకులు, కార్యకర్తలకు న్యాయం జరిగేలా వ్యవహరిస్తానని, త్వరలో చేపట్టనున్న కృష్ణా పశ్చిమ డెల్టా నీటి సంఘాలు, సొసైటీల ఎన్నికలలో ఏకగ్రీవానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ కనగాల మధుసూదన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిమితి మించితే ప్రమాదకరం



భట్టిప్రోలు: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం ప్రమాదకరమని ఎస్ఐ ఎం.శివయ్య పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరులో పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో తరలిస్తున్న డ్రైవర్, ప్రయాణికులకు ఎస్ఐ శివయ్య బుధవారం రాత్రి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని ఎస్ఐ కోరారు. నిబంధనలు పాటించకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని, డ్రైవర్లు యూనిఫామ్ ధరించాలని కోరారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

హార్వెస్టర్లతో పంట కోతలు

దిగుబడులను కాపాడుకునే పనిలో రైతులు బిజీ

భట్టిప్రోలు: వాయుగుండం ప్రభావం వీడడంతో రైతులు ఖరీఫ్ వరి సాగును కోసేందుకు బుధవారం హార్వెస్టర్లను ఆశ్రయించారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా రైతాంగం పంట దిగుబడులు కాపాడుకునే పనిలో బిజీగా ఉన్నారు.



భట్టిప్రోలు-వెల్లటూరు మార్గంలో హార్వెస్టర్ ద్వారా కోత కోస్తున్న దృశ్యం

వరి దుబ్బులు నిలబెట్టుకోవాలి

వర్షాలకు పడి పోయిన వరి దుబ్బులను నిలబెట్టుకుని కట్టలుగా కట్టాలి. పంట పొలాల్లో నీటిని బయటకు పంపే ఏర్పాటు చేయాలి. సాధ్యమైనంత వరకు పంటలను కోత కోయడం మరో రెండు రోజులు వాయిదా వేసుకోవడం మంచిది. తడిచిన ఓదెలపై ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఉప్పు కలిపిన ద్రావణం పిచికారీ చేసుకోవాలి.

–జి. మీరయ్య, ఏవో, భట్టిప్రోలు

రబీ సాగుపైనే ఆశలు

నేను ఎకరం కౌలుకి తీసుకుని సాగు చేశాను. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభం, చివరిలో సంభవించిన ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి తగ్గింది. ప్రస్తుతం హార్వెస్ట్ చేయించాను. పెట్టిన పెట్టుబడి అంతా వచ్చే 20 నుంచి 25 బస్తాలకే సరిపోతుంది. రబీలో వేసే మొక్కజొన్నపై ఆశలు పెట్టుకున్నాను. నేల తల్లి కరుణిస్తుందనే ఆశతో సాగు చేస్తున్నాను. నాకు ఊహ తెలిసిన నాటి నుంచి వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నాను. పంట కౌలు కాకుండా దిగుబడి వచ్చిన దానిని యజమానికి చెల్లిస్తూ వస్తున్నాను.

–ఆలూరి యోహాన్, కౌలు రైతు, భట్టిప్రోలు

బాలలు చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

బాలల పరిరక్షణ జిల్లా అధికారి కృష్ణ

రేపల్లెరూరల్: విద్యార్థి దశ నుంచే బాలలు చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని బాలల పరిరక్షణ జిల్లా అధికారి జి.కృష్ణ అన్నారు. బాలల హక్కులపై 100 రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పేటేరు జెడ్పీ హైస్కూల్లో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ప్రభుత్వం బాలలకు కల్పించిన హక్కులను తెలుసుకోవటంతో పాటు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే తప్పనిసరిగా ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. తమ హక్కులకు భంగం కలిగితే 1098 చైల్డ్ హెల్ప్ లైన్‌కు ఫోన్ చేసి న్యాయం పొందాలన్నారు. అనంతరం బాలల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలన, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీడీపీవో సుచిత్ర, సూపర్‌వైజర్‌లు నాంచారమ్మ, వెంకటరత్నమ్మ, హెచ్ఎం ఎం.పద్మావతి పాల్గొన్నారు. అదే విధంగా మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులకు చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో రూరల్ సీఐ సురేష్‌బాబు, ఎంఈవో రత్నశేఖర్, మోళ్ళగుంట పీహెచ్‌సీ వైద్యురాలు ప్రవల్లిక, ఫౌండేసన్ మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నివారించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ధర్మ పరిరక్షణ, ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు



హిందువులను రక్షించాలని కోరుతూ చేపట్టిన ప్రదర్శన

రేపల్లె రూరల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా హిందూ ధర్మ పరిరక్షణ, ఆర్ఎస్ఎస్, బీజేపీల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ అండ్ బీ అతిథి గృహం నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి ఆయా సమితుల నాయకులు చేరుకుని ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులను రక్షించాలని నినాదాలు చేశారు. ఇస్కాన్ గురువు చిన్నమయ్య కృష్ణను అక్రమంగా అరెస్ట్ చేయటం దారుణమని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ బాపట్ల జిల్లా ఎన్నికల కమిటీ కన్వీనర్ రాంపల్లి జగన్నాథశాస్త్రి, పట్టణ అధ్యక్షుడు అన్నం సాయి వరప్రసాద్, బీజేపీ ఎస్సీ మోర్చా బాపట్ల జిల్లా కన్వీనర్ బేతపూడి వెంకటేశ్వరరావు, సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా నాయకులు జంజనం హేమశంకరరావు, నాయకులు పిన్ని సాంబశివరావు, బండారు రమేష్, వీరాంజనేయులు, రామరాజు, కె.వరప్రసాద్, నాగలీల, సుగ్గుల సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల: బంగ్లాదేశ్‌లో హిందువులను కాపాడాలని కోరుతూ హిందూ బంధువులు బాపట్లలో బుధవారం ప్రదర్శన చేపట్టారు. పోలేరమ్మ దేవాలయం నుంచి పురవీధుల్లో ప్రదర్శన చేపట్టారు. హిందువులను కాపాడుకునేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. బంగ్లాదేశ్‌ను వెంటనే శాంతి మార్గంలో పయనించాలని కోరాలని డిమాండ్ చేశారు.

అమర గాయకుడు ఘంటసాలకు నివాళి



ఘంటసాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న వివేకానంద విగ్రహ సాధన కమిటీ సభ్యులు

భట్టిప్రోలు: నవతరం సైతం ఘంటసాల మాధుర్యాన్ని తలచుకుని పరవశించి పోవాల్సిందేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం ఘంటసాల జయంతిని పురస్కరించుకుని భట్టిప్రోలులోని బౌద్ధ స్థూపం ఎదురు మినీ ట్యాంక్ బండ్‌పై ఉన్న ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి వివేకానంద విగ్రహ సాధన కమిటీ నిర్వాహకులు బండారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఘంటసాల గాయకునిగానే కాక సంగీత దర్శకునిగా తనదైన బాణీ పలికించారన్నారు. కార్యక్రమంలో రావూరి సత్యనారాయణమూర్తి, బొలిశెట్టి శ్రీనివాసరావు, జంజనం హేమశంరరకావు, కొక్కిలిగడ్డ నాగ రమేష్, త్రాప రవి కుమార్, పసుపులేటి శివరామప్రసాద్, చీదెళ్ల రాజేష్, టి.శ్రీనివాసరావు, సీహెచ్‌వీ ఉమామహేశ్వరరావు, గొరిపర్తి సుభాష్ చంద్రబోస్, కొతరపు సారథి, ఒగ్గి రాజా, కె.చిదంబరరావు పాల్గొన్నారు.

ఆశ్రమ వృద్ధులకు నిత్యావసరాల పంపిణి

తెనాలి: విద్యార్థులకు చదువుతోపాటు సమాజంపై బాధ్యతను తెలియజేయటం మంచి విషయమని నారాయణ స్కూల్ తెనాలి ఒకటో బ్రాంచి నిర్వాహకులను శ్రీమహాత్మా సేవా శాంతి ఆశ్రమ వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి అభినందించారు. థాంక్స్ గివెన్ డేని రోజైన బుధవారం నారాయణ స్కూల్ విద్యార్థులు బుర్రిపాలెంలోని శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమంలోని వృద్ధులను కలిసి వారితో మాట్లాడారు. పండ్లు, కూరగాయలు, బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. అక్కడ వసతి పొందుతున్న వద్ధుల్ని కలసి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా బియ్యం, కూరగాయలు, నిత్యవసర సరుకులు అందజేశారు. నారాయణ స్కూల్ ఏజీఎం నాగరాజు, ప్రిన్సిపల్ నన్నపనేని నాగలక్ష్మి, ఏఓ రఘునాథ్, వైస్ ప్రిన్సిపల్ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

గత స్మృతులను గుర్తుచేసుకుంటూ...



బాపట్ల: బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం స్థానిక గౌతమ్ హోటల్‌లో బుధవారం జరిగింది. 1973–76 బ్యాచ్ బి.కామ్ విద్యార్థులు మూడవ సమావేశంలో ఆనాడు విద్య నేర్పిన అధ్యాపకులు వి.వెంకట సుబ్బారావు, కొంపల్లి శేషతల్ప సాయిలను సన్మానించారు. పూర్వ విద్యార్థి వి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. నూనూగు మీసాలతో బ్రహ్మచారులుగా కాలేజీని వదిలి తాతలుగా కలవటం ముదావహమని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. 48 సంవత్సరాల క్రితం విడిపోయి వివిధ వృత్తులను చేపట్టి పదవీ విరమణ పొందిన వారందరూ తమ వయసును మరిచిపోయి, గత స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో భుజగేంద్ర మౌళి, శ్రీహరి, రాఘవరావు, ఎస్.బి.మౌళి, మనోహర్, ఆంజనేయ వరప్రసాద్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామర్థ్య నిర్వహణ పరీక్షలు



ఓఎంఆర్ షీట్లను ప్రదర్శిస్తున్న అబ్జర్వర్స్, సూపర్‌వైజర్స్, ఫీల్డ్ ఇన్‌వెస్టిగేటర్స్

భట్టిప్రోలు: విద్యార్థుల్లో సామర్థ్య నిర్వహణను పరిశీలించేందుకు బుధవారం దేశ వ్యాప్తంగా పలు మండలాల్లో నిర్దేశించిన పాఠశాలల్లో ఓఎంఆర్ షీట్ విధానం ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ టాలెంట్ టెస్ట్‌లో భాగంగా 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్ష జరిగింది. భట్టిప్రోలు మండలంలో విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం స్కూల్, టీఎం రావు హైస్కూల్, వీపీ అండ్ జీఏస్ఎం హైస్కూల్ (సూరేపల్లి)లో ఈ పరీక్షలు నిర్వహించారు. ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న బోధన, శిక్షణలో మార్పులు, చేర్పులు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు మధ్య సత్సంబంధాల నేపథ్యంలో ఈ పరీక్షలు జరిగాయి. అబ్జర్వర్స్, సూపర్‌వైజర్స్‌గా పడవల కిషోర్ (వేమవరం ఎంపీపీఎస్ హెచ్ఎం), చిలుమూరు రామా రూరల్ హైస్కూల్ ప్రతినిధి చిన సత్యన్నారాయణ, ఫీల్డ్ ఇన్‌వెస్టిగేటర్స్‌గా భట్టిప్రోలు కేఎస్‌కే కళాశాలకు చెందిన ఇరువురు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని భట్టిప్రోలు టీఎం రావు హైస్కూల్ హెచ్ఎం చందలూరి రామకోటేశ్వరరావు పర్యవేక్షించారు.

రిసార్ట్స్‌పై పోలీసుల దాడులు



బాపట్లటౌన్: వసతి ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ జి.గంగాధరరావు తెలిపారు. మండలంలోని సూర్యలంక, ఓడరేవు ప్రాంతాల్లోని రిసార్ట్స్‌లో మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ తీరానికి వచ్చే పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్నారు. రిసార్ట్స్ ముసుగులో జూదాలు ఆడించినా, 18 ఏళ్ల లోపు చిన్నారులకు రిసార్ట్స్‌లో వసతి కల్పించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వసతి కల్పించే ప్రతి ఒక్కరి ఆధార్ కార్డు తనిఖీ చేసిన తర్వాతనే రూములు కేటాయించాలన్నారు. రిసార్ట్స్‌లో అక్రమ మద్యం నిల్వ చేస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. రిసార్ట్స్ తనిఖీ చేసిన వారిలో ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అభరణం చోరీపై కేసు

తెనాలిరూరల్: బంగారు ఆభరణం చోరీ అవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ గంగానమ్మపేటకు చెందిన జొన్నకూటి మాధవి తన బంగారపు కడియం, ఇతర ఆభరణాలు ఇంట్లో పెట్టింది. కొన్ని రోజుల అనంతరం బంగారపు కడియం మాత్రమే కనబడకుండా పోయింది. దీంతో ఇంట్లో పని చేసే వాళ్లు లేదా బయటి వారు తీసి ఉంటారని అనుమానిస్తూ పోలీసులను ఆశ్రయించింది. టూ టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.